
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0
తణుకు : 35.0 - 24.0

మునిసిపాలిటీల్లో బదిలీలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 19: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సారి ఉద్యోగులకు ఇచ్చిన బదిలీల ఉత్తర్వులు అమలవుతున్నాయి. మొదట మునిసిపాలిటీలలో బదిలీ ఉత్తర్వులందాయి. బదిలీల దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22 వరకు గడువు ఉంది. అయినప్పటికీ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం మునిసిపాలిటీల్లోని జూనియర్, సీనియర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్‌ఇన్‌స్పెక్టర్లకు సంబంధించి ఉత్తర్వులు వచ్చాయి. భీమవరం మునిసిపాలిటీకి సంబంధించి 15 మంది వరకు బదిలీలు వచ్చాయి. తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం మునిసిపాలిటీల్లో 5 ఏళ్ళు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఖచ్చితంగా బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. మరోసారి బదిలీలు వస్తాయంటున్నారు. కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లతోపాటు ఇంకా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించి బదిలీల ఉత్తర్వులు రావాల్సి వుంది. ఆగస్టు 17న బదిలీల ఉత్తర్వులు వచ్చాయి. నెలాఖరు వరకు గడువు ఇచ్చారు. అయితే వర్షాల కారణంగా గడువును ఈ నెల 15 వరకు పెంచారు. తర్వాత గడువును 22 వరకు పెంచారు. ఎక్సైజ్ శాఖకు మాత్రం ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునే గడువు ఉంది. దేవదాయ ధర్మాదాయ శాఖ, మిగిలిన ఇతర శాఖలకు సంబంధించి ఉత్తర్వులు 22లోగా వచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

విరాళాల వెల్లువ



వరద బాధితుల సహాయార్థం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమీకరించిన రూ.30 లక్షల విరాళం చెక్కును సీఎం చంద్రబాబుకు తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, ఇతర నాయకులు అందజేశారు. వీరిని ముఖ్యమంత్రి అభినందించారు.



వరద బాధితుల సహాయార్థం పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున కోటి 116 రూపాయల విరాళం చెక్కును గురువారం సీఎం చంద్రబాబుకు అందించారు. మొదట్లో వరద బాధితులకు 70 వేల ఆహార పొట్లాలను అందించారు. అసోసియేషన్ సభ్యులను ముఖ్యమంత్రి అభినందించారు. చిత్రంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యేలు పితాని, బొలిశెట్టి, ఆరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, పొందువ్వ శ్రీనుతోపాటు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామరాజు, కార్యదర్శి శ్రీరామనారాయణ (శ్రీనివాస్), ఉపాధ్యక్షులు నరసింహారావు, సూర్యనారాయణ, రాధాకృష్ణ, ఫణికుమార్, వెంకట శ్రీహరినాథ్ తదితరులు



వేటపై ప్రకృతి కన్నెర్ర

- మూడు నెలల్లో ఐదు సార్లు వాయుగుండాలు
- వరదొచ్చినా.. కలిసిరాని వేట

నరసాపురం, సెప్టెంబరు 19: ఈ ఏడాది సముద్ర వేటపై ప్రకృతి కన్నెర్ర చేసింది. వాయుగుండాలు, తుపాన్లతో వేట ముందుకు సాగలేదు. ఆశించిన వరదలు వచ్చినప్పటికీ మూడు నెలల్లో ఐదు సార్లు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. దీంతో వేటకు వెళ్లి వెను తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీజన్ ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బతిన్నారు. దీంతో రానున్న రోజుల్లోనైనా గంగమ్మ కరుణిస్తే... కష్టాల నుంచి గట్టెక్కుతామన్న ఆశతో మత్స్యకారులు ఉన్నారు.

జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. గోదావరి, సముద్రం కలిసే ప్రదేశం కావడంతో ఇక్కడ అపార మత్స్య సంపద దొరుకుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న రొయ్యి, టోనా, సందువాయి, మాగా, పండుగొప్ప వంటి రకాలు పుష్కలంగా దొరకడంతో సీజన్‌లో వేటాడేందుకు వందలాది బోట్లు తీరానికి వస్తుంటాయి. ఈ ఏడాది జూన్ 15 నుంచి వేట ఆరంభమైంది. గోదావరికి వరద కూడా ముందుగానే తాకింది. దీంతో సప్పనీటికి మత్స్య సంపద ఎదురొస్తుంది. వలలకు పుష్కలంగా మత్స్య సంపద దొరుకుతుంది. అయితే మత్స్యకారుల ఆశలపై ప్రకృతి వరుసుగా కన్నెర్ర చేసింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరుస వాయుగుండాలు, తుఫాన్లు వచ్చాయి. ఈ మూడు నెలల కాలంలో ఐదు సార్లుపైనే వచ్చాయి. దీంతో సముద్రంలోకి వెళ్లిన బోట్లన్ని వేట సాగకుండానే వెనక్కి రావాల్సిన పరిస్థితి వచ్చింది. దీని వల్ల భారీ నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఒకసారి బోటు వేటకి వెళితే ఐదు నుంచి ఏడు రోజుల వరకు సముద్రంలో ఉంటుంది. అయితే తుఫాన్లు కారణంగా వెళ్ళగానే గాలులు, వర్షాలు, అలలు ఎగసిపడుతుండటంతో వేట సాగించలేక వెనక్కి వచ్చేశారు. దీంతో రానున్న రోజుల్లోనైనా గంగమ్మ కరుణిస్తుందన్న ఆశతో మత్స్యకారులు ఉన్నారు.

ఉచిత ఇసుకకు గ్రహణం





- తొలి రోజు ఆన్‌లైన్ బుకింగ్ నిల్
- బుకింగ్‌దారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- వెబ్‌సైట్ ఓపెన్ కాలేదంటూ సమాధానం
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి
- వినియోగదారులను వీడని ఇసుక కష్టాలు
- ఆగిన ఎగుమతులు

పాలకొల్లు, సెప్టెంబరు 19: ఉచిత ఇసుక సరఫరాకు పట్టిన గ్రహణం వీడటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అయినప్పటికీ ఉచిత ఇసుక పాలసీని నీలినీడలు కమ్ముతూనే ఉన్నాయి. గురువారం నుంచి ఇసుక వినియోగదారులు తమ సమీపంలోని సచివాలయాలలో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చని ప్రయత్నించారు. ఇసుక ఎగుమతిదారులు గురువారం ఉదయం 10గంటలు నుంచి సచివాలయాలు చూట్టూ ప్రదక్షిణలు చేయటమే కానీ ఫలితం దక్కలేదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొనిఉంది. కొన్ని సచివాలయలలో మధ్యాహ్నం 12గంటలకు ప్రయత్నించినప్పటికీ ఇంకా ఉదయం 10గంటలు కాలేదని, మరికొంత సమయం నిరీక్షించాలని వెబ్‌సైట్‌లో కనిపించడం గమనార్హం. మరికొన్ని ప్రాంతాల్లో ఇంకా ఉచిత ఇసుకకు ఆన్‌లైన్ బుకింగ్‌కి అనుమతులు రాలేదని సమగ్ర సైట్‌లో కనిపించినట్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి కనబడగా ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోవడానికి ఇంకా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని తెలుస్తుంది.

కూటమి అధికారం చేపట్టిన తొలినాళ్లలో పర్వతాలు మాదిరిగా ఉన్న ఇసుక నిల్వలను ఇసుకాసురులు కేవలం 10రోజుల్లో కొల్లగొట్టారు. అనంతరం ఇసుకను స్టాక్ పాయింట్‌లకు చేరవేయడానికి అయిన ఖర్చులను వెచ్చించి ఆమేరకు వినియోగారులు చెల్లించాలని విధానాన్ని రూపొందించారు. సమగ్ర విధానాలు అమలు కాకముందే తూర్పు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో రెండు మూడు స్టాక్ పాయింట్‌లు మినహా మిగిలిని చోట్ల ఇసుక ఖాళీ అయ్యింది. గత 10రోజులుగా పెండ్యాల, పందలపర్రు, ర్యాంపులలో ఇసుక ఎగుమతులు జరిగాయి. ఇక్కడా అవినీతి రాజ్యమేలింది. ఉభయ గోదావరి జిల్లాల్లోనూ 10రోజులుగా ఇసుక ధరలు గరిష్ట స్థాయికి చేరాయి. 5యూనిట్లు ధర రూ.25వేలు ధర పలికింది.

ఓపెన్ కాని వెబ్‌సైట్

ఇసుక ఎగుమతులలో పారదర్శకత నెలకొల్పడానికి ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని 19వ తేదీన అమలులోకి తెచ్చారు. అయితే సాంకేతిక ఇబ్బందులతో తొలిరోజు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. ఈకారణంగా ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ ప్రక్రియకు అంతరాయం కల్గింది. ఒకవైపు స్టాక్ పాయింట్‌లలో ఇసుక నిల్వలు అయ్యిపోయాయి. మరోవైపు గోదావరికి పూర్తిస్థాయిలో వరద తగ్గలేదు. రెండు మూడు పడవల ర్యాంపులలో ఇసుక సేకరిస్తున్నప్పటికీ ఉమ్మడి జిల్లాలోని పెద్దతరహా, 8 ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు మొదలైతేనే కష్టాలు గట్టెక్కుతాయని చెబుతున్నారు. అక్టోబరు నెలాఖారునాటికి ప్రధాన రీచ్‌లలో బాటలు వేస్తే కొంతమేర ఇసుక కష్టాలు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన టిప్పర్‌లారీ యూనియన్ నాయకులు బుధవారం పశ్చిమ జాయింట్ కలెక్టర్‌తో భేటీ కాగా గురువారం తూర్పుగోదావరి జిల్లా జాయింట్‌కలెక్టరుతో యూనియన్ నాయకులు సమావేశం అయ్యారు. ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభమై, పూర్తిస్థాయిలో బుకింగ్‌లు మొదలైనప్పటికీ తమ డిమాండ్‌లను నెరవేర్చలేదని జేసీ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకెళ్ళారు.

అభిప్రాయాలు తీసుకుంటాం: సీఎం

భీమవరం టౌన్, సెప్టెంబరు 19 : ఉచిత ఇసుక విధానంపై ఆన్‌లైన్ పోర్టల్‌ను అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సాయంత్రం ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయభాస్కర రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇసుక రవాణాకు కేటాయించిన వాహనం ఎక్కువ సమయం స్టాక్ పాయింట్ వద్ద వేచి ఉండకుండా కేటాయించిన సమయానికి లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివా లయాలు ద్వారానే కాకుండా వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా పోర్టల్ రూపొందించడం జరిగిందన్నారు.





విలేకరులతో మాట్లాడుతున్న శేషుబాబు.. వైసీపీ ఫ్లెక్సీలను దహనం చేస్తున్న ఆయన మద్దతుదారులు..

నన్ను ఎందుకు సస్పెండ్ చేశారు ?

- వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలన్న మాజీ ఎమ్మెల్సీ శేషుబాబు
- వైసీపీ జెండాల దహనం

పాలకొల్లు/రూరల్, సెప్టెంబరు 19 : వైసీపీ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో నాయకులు చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ, మాజీ జడ్పీ చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు ప్రశ్నించారు. పాలకొల్లు మండలం పూలపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన తండ్రి కోటేశ్వరరావుతో కలిసి శేషుబాబు దంపతులు మాట్లాడారు. 'కల్లబొల్లి మాటలతో కార్యకర్తలను మోసం చేసిన పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను ముందుగా సస్పెండ్ చేయాలి. ఎన్నికల ఖర్చు నిమిత్తం జగన్ ఇచ్చిన రూ.30 కోట్లు ఏం చేసారో సమాధా నం చెప్పాలి. ఎన్నో త్యాగాలను చేయడంతోపాటు అవమా నాలు ఎదుర్కొన్నా. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మీద ఉన్న అనుబంధంతో పార్టీలో కొనసాగాను' అని చెప్పారు. కోటేశ్వ రరావు మాట్లాడుతూ జగన్ అధికారం కోల్పోయిన తర్వాత బురదలో తిరిగినా ప్రయోజనం లేదని, వైసీపీ సర్వనాశనం అయిపోతుందని అన్నారు.

సస్పెన్షన్ వెనుక కారణాలేంటి ?

పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారని వచ్చిన పలు ఫిర్యాదులపై మాజీ జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ శేషుబాబును పార్టీ అధ్యక్షుడు జగన్ సస్పెండ్ చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో కొన్నేళ్లుగా మూడు గ్రూపులుగా నాయకులు పని చేస్తున్నారు. ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత నాయకుల్లో వర్గ విభేదాలు మరింత పెరిగాయి. లోకల్, నాన్ లోకల్ అన్న అభిప్రాయాలు పెరగడంతో పార్టీ క్యాడర్ ఒక్క తాటిపై పనిచేయలేదని అందుకు కారణం శేషుబాబు ఒకరని పార్టీలో ప్రచారం జరిగింది. పార్టీ కార్యక్రమాలు విడివిడిగా చేయడంతో ప్రస్ఫుటమైంది. జరిగిన పరిణామాల నేపథ్యంలో ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షులను మార్చిన అనంతరం శేషుబాబుపై బహిష్కరణ వేటు వేసినట్లు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో శేషుబాబు అభిమానులు పూలపల్లిలో గురువారం వైసీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జగన్, పార్టీ నాయకుల ఫొటోలను దహనం చేశారు. మద్దతుదారులు పెద్ద సంఖ్యలో శేషుబాబు నివాసానికి చేరుకున్నారు.

అన్నక్యాంటీన్ ప్రారంభంలో రచ్చ

- టీడీపీ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు పెట్టకపోవడంపై ఆగ్రహం
- క్యాంటీన్ గేటు మూసివేసి ధర్నా
- నరసాపురంలో రెండు గంటలు హైటెన్షన్





నరసాపురంలో ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు.. (ఇన్‌సెట్‌లో) క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయకర్, పొత్తూరి, షరీఫ్

నరసాపురం టౌన్, సెప్టెంబరు 19: పట్టణంలోని స్టీమర్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు, ఫొటోలు పెట్టకపోవడంపై ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి గురువారం రాత్రి ధర్నాకు దిగారు. పార్టీ ముఖ్య నాయకులు రంగంలోకి దిగి జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. క్యాంటీన్ ప్రారంభోత్సవ ప్రొటోకాల్ అంతా పురపాలకం సంఘం పర్యవేక్షణలో జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ ఫొటోలతో పాటు ఎమ్మెల్యే నాయకర్, మాజీ శాసన మండలి చైర్మన్ షరీఫ్, చైర్‌పర్సన్ వెంకటరమణ, వీసీలు, కౌన్సిలర్లు మల్లాడి బుజ్జి, బొంతు రాజశేఖర్ ఫ్లెక్సీలు క్యాంటీన్ ముందు కట్టారు. అయితే ప్రారంభోత్సవ సమయానికి విచ్చేసిన టీడీపీ నాయకులు తమ నేతలైన పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడుల ఫొటోలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. అన్న క్యాంటీన్ ముందు బైఠాయించి కమిషనర్ అంజయ్య రావాలంటూ నినాదాలు చేశారు. ఆయన రాకపోవడంతో వైసీపీ నేతల ఫ్లెక్సీలు తొలగించారు. ప్రొటోకాల్ పాటించిన తరువాత క్యాంటీన్‌ను ప్రారంభించాలని రోడ్డుపై బైఠాయించారు. ఈనేపథ్యంలో కమిషనర్ అంజయ్య టీడీపీ కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే నాయకర్, షరీఫ్‌ను, రామరాజును కలిసి చర్చించారు. జరిగిన లోపాన్ని వివరించారు. దీంతో నేతలు సమస్యకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. ఆఘమేఘాలపై పొత్తూరి, కొవ్వలి ఫ్లెక్సీలు వేయించి క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేశారు. దీంతో కేడర్ శాంతించారు. ఆ తరువాత ఎమ్మెల్యే నాయకర్, షరీఫ్, పొత్తూరి రామరాజులు క్యాంటీన్‌ను ప్రారంభించారు.

ఇక అర్బన్ మార్కెట్‌లు

భీమవరం టౌన్, సెప్టెంబరు 19 : పట్టణాల్లో స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న వస్తువులను విక్రయించేందుక వీలుగా మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వీటిని ఏర్పాటు చేయించినా అంతగా ఫలితాలు కనిపించలేదు. మొక్కుబడిగా సాగటంతో పాటు సరైన ప్రచారం లేకపోవటంతో స్టాల్స్ ఏర్పాటు చేసినా కొనుగోళ్ళు అంతంతమాత్రంగా ఉండేవి. దీంతో మహిళా సంఘాలకు ఆర్థికంగా అంతగా ఉపయోగపడలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోపాటు మెప్మా ద్వారా మరోసారి అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ మార్కెట్‌లలో కంటే తక్కువగా ధరలు ఉండే విధంగా మహిళలకు ఇబ్బంది లేకుండా ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అర్బన్ మార్కెట్‌లను 4 బ్రాండ్‌లుగా ఏర్పాటు చెయ్యనున్నారు. అందులో వస్త్రాలంకరణ, ఆభరణ(జ్యూవలరీ), కత(హ్యాండీ క్రాఫ్ట్) ఆహా (ఆహారపదార్థాలు) కింద స్టాల్స్‌ను ఏర్పాటుచేసి అమ్మకాలు చెయ్యనున్నారు. ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా కూడా అమ్మకాలను చేపడుతున్నారు. ఓపెన్ నెట్‌వర్క్‌ఫర్ డిజిటల్ మార్కెట్ ద్వారా చేపడుతున్నారు.

నేడు భీమవరంలో ఏర్పాటు

మొదటిసారిగా అర్బన్ మార్కెట్‌లను భీమవరంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్కెట్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభిస్తారు. అదే విధంగా పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు నగర పంచాయతీల్లో కూడా వరుసగా అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

పర్యావరణాన్ని కాపాడాలి: కలెక్టర్

భీమవరం క్రైం, సెప్టెంబరు 19 : పర్యావరణ హిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. గురువారం విష్ణు కాలేజీ నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీలో జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, కనుమూరి రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. తొలుత సైకిల్ ర్యాలీని ఎమ్మెల్యే రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ విష్ణు కాలేజీ మెయిన్ గేట్ నుంచి బీవీ రాజు సర్కిల్ వరకు ప్లకార్డులు చేతపట్టుకుని, పర్యావరణంపై స్లోగన్స్ ఇస్తూ ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సైకిల్ వాడకం వలన వాహన కాలుష్య నియంత్రణతో పాటు, వ్యక్తిగత దేహదారుఢ్యానికి ఉపయోగపడుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోగలుగుతామన్నారు. అప్పుడే సమాజం ఆర్థికంగా, ఆరోగ్యపరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ ముఖ్యంగా విద్యార్థులు సైకిల్ తొక్కడం అలవర్చుకోవాలని, చిన్న చిన్న దూరాలకు సైకిల్‌పై వెళ్లడం చాలా మంచిదని తెలిపారు. కార్యక్రమంలోజిల్లా అదనపు ఎస్పీ భీమారావు, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నోడల్ అధికారి బీవీ నాగేశ్వరరావు, డీఈవో జి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

స్వర్ణాంధ్రకు ప్రణాళికలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 19: స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. గురువారం చీఫ్ సెక్రటరీ విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాల్లో స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ వచ్చేనెల15వ తేదీ నాటికి రూపొందించాలని తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలని ఆదేశించారు. ఇదే క్రమంలో స్వర్ణాంధ్ర కోసం రానున్న ఐదేళ్లకు వార్షిక ప్రణాళిక రూపొందించా లన్నారు. ప్రతి ఏటా లక్ష్యం ఏంటో వార్షిక ప్రణాళికలో పొందుపరుస్తూ డాక్యుమెంటరీ సిద్ధం చేయాలన్నారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డాక్టర్ల సమ్మె

వైరల్ ఫీవర్లు, అంటురోగాల భయం

భీమవరం టౌన్/ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19 : పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్ సర్వీస్ రిజర్వేషన్లను పాతవిధానం ప్రకారమే ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న ఎంబీబీఎస్ వైద్యాధికారులను కొనసాగించాలని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు కొద్దిరోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం కూడా కొనసాగింది. జిల్లాలోని 34 పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు విధులకు 68 మంది హాజరు కావలసి ఉండగా 34 మంది హాజరయ్యారని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. మిగిలిన వారు హాజరుకాలేదని సంబంధిత అధికారులు తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. పీహెచ్‌సీలో వైద్యులు లేని చోట్ల అత్యవసర కేసులు వస్తే వెంటనే ప్రథమ చికిత్స చేసి వారిని 108 వాహనంలో ఏరియా ఆసుపత్రులకు తరలించాలని ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని తగిన ఆదేశాలు ఇస్తున్నామని ఆయన తెలిపారు. డెంగీ, చికున్ గున్యా, మలేరియా తదితర వైరల్‌జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలుతున్నట్టు క్షేత్ర స్థాయి నుంచి కొన్నిచోట్ల సమాచారం అందుతోంది. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు తమ డిమాండ్ల సాధనకోసం చేపట్టిన సమ్మె కారణంగా పల్లెప్రాంతాల్లో వైద్యసేవలకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పై అత్యవసర చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు వైద్యసేవలు, రోగనిర్ధారణ పరీక్షలు, మందులు అందించేం దుకు ఉద్దేశించిన 108 సర్వీసులపైనా డాక్టర్ల నిరవధిక సమ్మె ప్రభావం ఒకింత కనబడుతోంది.



ఎంపికైన క్రీడాకారులతో కళాశాల సిబ్బంది

స్కూల్ గేమ్స్‌కు జట్ల ఎంపిక

తణుకు, సెప్టెంబరు 19 : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అన్నారు. బుధవారం కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో బాలబాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించారు. డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీబాయ్, ఎస్‌డి కాలేజి ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా సెక్రటరీ కె.జయరాజు, పీడీలు శ్రీనివాసు, రత్నకుమారి పాల్గొన్నారు.

ఖోఖో : కె.పావనీ, ఎస్.విద్యాస్వి, పి.గాయత్రీ నైనిక (భారతీయ విద్యాభవన్స్, భీమవరం), పి.నవ్య, కె.కీర్తన (సెయింట్ థెరిస్సా-ఏలూరు) కె.సుభాసినీ, టి.సుష్మ, శ్రీసుధ (ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల-తణుకు), ఎన్.హేమలక్ష్మి ప్రసన్న, కె.శ్వేతాశ్రీ (ఏపీఆర్ జూనియర్ కాలేజి-నాగిరెడ్డిగూడెం) ఎం.శరణ్య (జూనియర్ కాలేజీ-ద్వారకాతిరుమల) ఎన్.స్రవంతి, కె.రోజా దీపిక (జంగారెడ్డిగూడెం) జి.భూమిక (పోలసానిపల్లి) సిహెచ్.శైలజా,ఎస్.భవానీ(గోపాలపురం) ఎ.సువర్ణ

త్రోభాల్ : నిధి, బి.అనూష, ఎస్.హర్షిని, టి.ప్రభుప్రియ (సెయింట్ థెరిస్సా-ఏలూరు)సి.శ్రావణి, కె.వెన్నెల (గురుకులం-గోపాలపురం) కె.లక్ష్మికుమారి, ఎ.పూజిత, కె.అమృతశ్రీ (గురుకులం-పోలసానిపల్లి), బ్లెస్సీ, కె.మేరిమణి, టి.కవిత (ఎస్‌కెఎస్‌డీ కళాశాల-తణుకు), .లావణ్యమహేశ్వరి, పి.తేజస్వినీ (గురుకులం-జంగారెడ్డిగూడెం)

వాలీబాల్: బి.యేసుమణి (ఆకివీడు) ఎం.శిరీష, పి.కావ్య, టి.హస్వి (సెయింట్ థెరిసా-ఏలూరు) ఎ.శిరీష, జి.విజయ లక్ష్మి (ఎస్‌కెఎస్‌డీ- తణుకు) ఎన్.ప్రవల్లిక (ద్వారకాతిరుమల గురుకులం,) పి.సాహితి, బి.భవాని, బి.లావణ్య (గురుకులం-గోపాలపురం) ఎస్.రోజాప్రవల్లిక (చాగల్లు)

టేబుల్ టెన్నిస్ : ఎ.యేసురాణి, జి.నవ్య, బి.వర్ష, కె.సౌమ్య, కె.ఐశ్వర్య, డి.అపర్ణ (సెయింట్ థెరిస్సా -ఏలూరు) కుష్బూ నిసా (ఎస్‌కెఎస్‌డీ, తణుకు)

బ్యాడ్మింటన్ : ఎం.అమృత వర్షిణి, డి.యశ్వని నవ్య, ఆర్, మేఘన, ఎస్,ఈశ్వరి, పి,రోషితశ్రీ (ఎస్‌కెఎస్‌డి, తణుకు)

చదరంగం : ఎస్.అర్షు , పి.సత్యనారాయణ,(చాంబర్స్ -పాలకొల్లు) వై.జోషి (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ -పెదవేగి) ఎస్. యోగేంద్ర (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ ఎల్‌బీచర్ల) కె.సుభాషిణి, (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్- ఆరుగొలును)

టెన్నికాయిట్ :బి.మానస, కె.సుజిని (నల్లజర్ల), డి.దేవిశ్రీ (థెరిస్సాఏలూరు) కె.భవాని, కె.గౌరీ పూజశ్రీ (ఏపీఆర్ఎస్ -నాగిరెడ్డిగూడెం) జి.రక్షిత, ఎన్.నవ్య (పోలసానిపల్లి) మనీషా (గురుకులం జంగారెడ్డిగూడెం)

యోగా : వై.కుసుమ కావ్య, దేవమాధురి, కీర్తి సువర్ణిక, శశి వెన్నెల, సంధ్యారాణి (ఎస్‌కెఎస్‌డీ- తణుకు) రాధ (ఎస్ఎస్‌వీటీ-తణుకు), జి.సుస్మారాణి, ఎస్.శ్రావణి (నాగిరెడ్డిగూడెం) ఎంపికయ్యారు.

5 నుంచి భీమవరంలో ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు

భీమవరంటౌన్, సెప్టెంబరు 19 : విద్యార్థి దశ నుంచే వైజ్ఞానిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో శ్రీహరికోట ఇస్రో కార్యాలయ ఉద్యోగులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిశారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా వచ్చేనెల 5 నుంచి ఏడో తేదీ వరకు భీమవరంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలుపుతూ కరపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 4 నుంచి 10వ తేదీవరకు వారం రోజులపాటు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. శ్రీహరికోట స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లోని పది ప్రాంతాలను ఎంపికచేసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు తెలిపారు.మన రాష్ట్రంలోని ఈ జిల్లాలో భీమవరం పట్టణాన్ని ఎంపిక చేశారని, విష్ణు స్కూల్‌లో కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తేదీన స్పేస్ వాక్ కార్యక్రమంతో ప్రారంభించి,ఆరో తేదీన స్పేస్ క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహిస్తారన్నారు. ఇస్రో ఎగ్జిబిషన్ ఉంటుందని జిల్లాలోని అన్ని కళాశాలల, పాఠశాలల విద్యార్థులు సందర్శించి వైజ్ఞానిక విషయాలను తెలుసుకోవచ్చన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో కూడా పోటీలు నిర్వహిస్తారని ఆ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. శ్రీహరికోట నుంచి క్వాలిటీ కంట్రోల్ జనరల్ మేనేజర్ పి.ఏడు కొండలు, హెడ్ ఆఫ్ సివిల్ డిపార్ట్మెంట్ డాక్టర్ సతీష్, సైంటిస్ట్ ఆకెళ్ళ శేష సాయి ఉన్నారు.

23, 24న విర్డ్ ఆసుపత్రిలో హ్యాండ్‌సర్జన్ సేవలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19: ద్వారకాతిరుమల విర్డ్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఈనెల 23, 24 తేదీల్లో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించనున్నట్టు ఆసుపత్రి ట్రస్ట్ ఛైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, ఇతర చేతి సమస్యలు ఉన్నవారు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో నిర్దేశించిన వైద్యసేవలను ఉచితంగా అందిస్తామన్నారు. ముందుగా 83744 45108,79016 95176 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19: ద్వారకాతిరుమలలో ఈనెల 27న రాష్ట్ర రైతు సదస్సు నిర్వహిస్తున్నామని, 27 నుంచి 29 వరకూ రైతు శిక్షణా తరగతులను జరుపుతామని ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. ద్వారకాతిరుమల యూటీఎఫ్ భవనంలో రైతుసంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సంక్షోభం- మద్దతు ధరలు అనే అంశంపై సదస్సు జరుగుతుందని ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విచ్చేస్తారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 200 మంది రైతు ప్రతినిధులు, రైతుసంఘ రాష్ట్ర నేతలు హాజరవుతారని వివరించారు. కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్, జీవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రవిచంద్ర..నకిలీ కరెన్సీ నోట్లు

దొంగ నోట్ల ముఠా అరెస్ట్

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 19 : అసలు కరెన్సీకి మూడు రెట్లు నకిలీ కరెన్సీ ఇస్తామని మోసం చేసే ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. గురువారం జంగారెడ్డిగూడెం స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గతంలోనే వీరిపై దొంగనోట్ల కేసు నమోదైందని వీరంగా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. వీరి నుంచి రూ.2.50 లక్షల నకిలీ ఐదు వందల నోట్లు, రూ.నలభైవేల ఒరిజినల్ ఐదు వందల నోట్లు, ఒక కారు, ద్విచక్ర వాహనం స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. నకిలీ నోట్లన్నీ చిన్న పిల్లలు ఆడుకునే టాయ్ కరెన్సీ అని వాటిని ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి తెప్పించినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన బర్రె సుధీర్, టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడేకి చెందిన చిట్ల నాగరాజు, నెర్సు గంగాధర్, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన ఏలేటి చంద్రశేఖర్, జంగారెడ్డిగూడెం మండలం వేగవరానికి చెందిన ఓగిరాల బాబులను అరెస్టు చేశామని వీరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.



అధ్వానంగా కే.పెంటపాడు-పడమరవిప్పర్రు రహదారి



గోతులు పడిన కొమ్మర-పాలూరు రహదారి

ప్రయాణం..నరకప్రాయం

కే.పెంటపాడు-పడమర విప్పర్రు రోడ్డుకు మోక్షమెప్పుడో

పెంటపాడు, సెప్టెంబరు 19 : కే.పెంటపాడు నుంచి పడమర విప్పర్రు వెళ్ళే రహదారి సమస్య ఇప్పటిది కాదు. సంవత్సరాల కాలంగా అలాగే ఉంది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే సాహసం చేసినట్లే. ఒళ్ళు మొత్తం హూనమైపోతుంది. రహదారి మొత్తం గతుకులతో అధ్వానంగా ఉంటుంది. అత్యవసరంగా ప్రయాణం చేద్దామంటే ఇబ్బందులు పడాల్సిందే. ఎవరికి ఏమి జరిగినా తాడేపల్లిగూడెం వెళ్లాల్సిందే. ఇటీవల గ్రామంలో ఒక వ్యక్తి ని పాము కరిచింది. పొలం నుంచిఅతను ఇంటికి వచ్చి సమాచారం చెప్పేసరికే అరగంట దాటిపోయింది. దీంతో ఆ వ్యక్తికి అత్యవసరంగా చికిత్స అందించాల్సి వచ్చింది. వేగంగా కారు నడిపే ఒక వ్యక్తి అతన్ని రహదారిపై గతుకులను కూడా లెక్క చేయకుండా సకాలంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించడంతో గండం నుంచి బయట పడ్డాడు. ముఖ్యంగా గర్భిణులు ఈ రహదారిపై ప్రయాణం చేయడానికి నరకం చూస్తున్నారు. గ్రామంలో స్వయంభూగా వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ రహదారి పడమరవిప్పర్రు మీదుగా గణపవరం వెళ్తుంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణాలు చేసేవారి సంఖ్య కూడా ఎక్కువే. వాస్తవానికి కే.పెంటపాడు నుంచి పడమరవిప్పర్రు రహదారికి గత ప్రభుత్వ హయాంలో రూ.7 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పడమరవిప్పర్రు గ్రామం మొదటి నుంచి శివారు కాలువ వంతెన వరుకూ ఆర్అండ్‌బీ నిధులు రూ 3 కోట్లతో సీసీ రహదారి నిర్మాణం జరుగుతోంది.

అత్తిలి-తణుకు రోడ్డులో అడుగడుగునా గోతులే

అత్తిలి, సెప్టెంబరు 19 : మండలంలోని రహదారులు అధ్వాన స్థితికి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారుల మీద ప్రయాణం చేయాలంటే వల్లు హూనం అవ్వాల్సిందే. ప్రధానంగా అత్తిలి నుంచి తణుకు వెళ్ళే రహదారిలో కెఎస్ గట్టు గ్రామంలో రహదారి కోతకు గురి కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా అనేక మంది వెళ్తూ ఉంటారు. మరమ్మతులు కూడా చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలూరు నుంచి కొమ్మర వెళ్ళే రహదారిలో అడుగుకో గొయ్యి ఉంది. వర్షం వస్తే గోతుల్లో నీరు నిలిచి పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు గోతులో పడడంతో గాయాల పాలవుతున్నారు



అత్తిలి రేలంగి మధ్యలో కోతకు గురైన రహదారి



కూలిన బైనేరు బ్రిడ్జి(ఫైల్)

ఏడేళ్లుగా అవస్థలు..

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 11: జంగారెడ్డిగూడెం నుంచి రాజ మహేంద్రవరం వైపు వెళ్లే రహదారిలో ఉన్న బైనేరు కాలువపై బ్రిడ్జి కూలిపోయి ఏడు సంవత్సరాలవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2018 ఆగస్టులో వచ్చిన భారీ వరదలకు బైనేరు బ్రిడ్జి కూలిపోయింది. తర్వాత 2019లో ఎన్నికలొచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఈ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించలేదు. ప్రభుత్వం రూ.3.6 కోట్ల నిధులు మంజూరు చేసి మూడు సార్లు టెండర్లు పిలిచినా బిల్లులు రావని భయపడి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. బ్రిడ్జి లేకపోవడంతో జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల ప్రజలు బైనేరు బ్రిడ్జి దగ్గరలో ఉన్న ఫైర్ స్టేషన్ పక్కనే ఉన్న లింకు రోడ్డు నుంచి బైపాస్ రోడ్డుకు వెళుతున్నారు. నిత్యం వందల కొద్దీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఈ లింకు రోడ్డుపై నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్తుండడంతో రోడ్డంతా గోతులుగా మారింది.

ఎమ్మెల్యే పట్టించుకోవాలి



ఏడేళ్ళుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెనకు అవతలి వైపున ఉన్న కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాలకు చెందిన ప్రజలు పాత బస్టాండు వైపుగా పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు నుంచి బుట్టాయిగూడెం రోడ్డులో నుంచి పట్టణంలోకి వస్తుండ డంతో పాత బస్టాండులో ఉన్న చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతు న్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టి సారించి బైనేరు బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేయాలి.

-వలవల తాతాజీ, నాల్గవ వార్డు కౌన్సిలర్, జంగారెడ్డిగూడెం



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న డీఆర్ఎం నరేంద్ర

కోటిపల్లి రైల్వే లైన్ పనులు వేగవంతం చేయండి

కొత్త రైళ్లపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సమీక్ష

నరసాపురం, సెప్టెంబరు 19: నరసాపురం- కోటిపల్లి రైల్వే లైన్ పనుల్ని వేగవంతం చేయాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఆదేశించారు. గురువారం విజయవాడలో రైల్వే డివిజన్ అధికారులతో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, కొత్తరైళ్లు, వందేభారత్ రైళ్ల జిల్లాలో ప్రవేశం, తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర పాటిల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కోటిపల్లి ప్రాజెక్టు పనుల్ని మంత్రికి వివరించారు. వంతెనల నిర్మాణాలు, పురోగతి, భూ సేకరణ, ఇంకా ఎక్కడెక్కడ పెండింగ్ అన్న విషయాలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి అధికారులతో మాట్లాడుతూ ఈ కొత్త రైల్వేలైన్ రెండు జిల్లాల వాసుల చిరకాల కోరిక అని దీనికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి విడుదల చేయిస్తానని, భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. 2025 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. అలాగే పెండింగ్, ప్రతిపాదనలో ఉన్న రైళ్లను పట్టాలెక్కించాలన్నారు. వందేభారత్ రైలుతో పాటు జిల్లాలోని నరసాపురం, భీమవరం, టీపీ గూడెంలో కడుతున్న అమృత్ భారత్ పనుల్ని కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. రైల్వే అధికారులు శ్రీనివాసరావు, రాంబాబు, వరుణ్‌బాబు, సురేష్, శ్రీసత్య స్వరూప్‌లు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల ఈవోగా ఎన్వీఎస్ఎన్ మూర్తి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19: రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా ఎన్వీ ఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయశాఖలో ముగ్గురు జాయింట్ కమిషనర్‌లను బదిలీ చేశారు. తిరుమల తిరుపతి ఆర్జేసీగా పని చేస్తున్న మూర్తిని ద్వారకాతిరుమలకు బదిలీ చేశారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన వేంద్ర త్రినాథరావును సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి బదిలీ చేశారు.

ఆ..విద్యార్థినుల భవిష్యత్తు ఏమిటి ?

చదువు మానేసి ఆశ్రమం నుంచి ఇళ్లకు వెళ్లిపోయిన 45 మంది

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 19 : బంగారు భవిష్యత్తు కలిగిన 45 మంది విద్యార్థుల భవితవ్యం అధికారుల నిర్లక్ష్యంతో చీకటిమయం అవుతోంది. ఏలూరు నగరంలో ఒక సేవా సంస్థ పేరుతో ఆశ్రమం ముసుగులో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. దానికి అనుమతులు ఉన్నాయో లేదో తనిఖీలు చేయాల్సిన బాలికల సంరక్షణ అధికారులు నిర్లక్ష్యం చేశారే విమర్శలు వస్తున్నాయి. వసతి గృహాలకు సరైన రక్షణ ఉందో లేదో పరిశీలించాల్సిన పోలీసు శాఖ కూడా వైఫల్యం చెందిందని విమర్శలు వస్తున్నాయి. విద్యాశాఖ కూడా ఆ విద్యార్థులు డేస్కాలర్సా, హాస్టలర్సా అనే విషయాలను గుర్తించాల్సి ఉంది. విద్యాశాఖాధికారులు కూడా తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందని అంటున్నారు. వీరికి స్థానికంగా ఉన్న ఎస్సీ, బీసీ హాస్టల్స్‌కు సంబంధించిన కొంతమంది ఉద్యోగులు కూడా సహకరించారని ఆరోపణలు వస్తున్నాయి. అక్కడ హాస్టల్స్‌లో సీటు కోసం వెళ్ళిన విద్యార్థినులకు తమ వద్ద ఖాళీలు లేవని ఉచితంగానే వసతి గృహం సేవాశ్రమం వారు నిర్వహిస్తున్నారంటూ ఉచిత సలహా ఇచ్చేవారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అమీనాపేటలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు, అక్కడ వసతులు, ఆహారం సరిగా లేకపోవడంతోనే కొంతమంది వెళ్లారని చెప్తున్నారు. అమీనాపేటలో ఉన్న హాస్టల్ నుంచి 11 మంది విద్యార్థినులు బయటకు వెళ్ళి ఆ ఆశ్రమం వసతి గృహంలో చేరారు. మరో వసతి గృహం నుంచి ముగ్గురు విద్యార్థినులు ఈ ఏడాది చేరారని తెలుస్తోంది. ప్రస్తుతం ఆశ్రమం వసతి గృహంలో 45 మంది విద్యార్థినులు ఉండగా లైంగిక దాడుల సంఘటనలతో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇళ్ళకు తీసుకువెళ్ళిపోయారు. కనీసం ఆ పిల్లలకు మరోచోట వసతి గృహం ఏర్పాటు చేయడం, వేరే వసతి గృహాలకు చేర్పించడం కాని అధికారులు చేయలేదు. ప్రకాశం జిల్లా నుంచి కూడా ఇంటర్మీడియట్ చదివే ఒక విద్యార్థిని ఈ వసతి గృహంలో ఉండి చదువుతోంది. ఈనెల 18వ తేదీ సాయంత్రం వరకూ అధికారులు వచ్చి ఏమైనా సాయం చేస్తారని ఎదురు చూసి ఎవరూ రాకపోవడంతో చివరకు సాయంత్రం వరకూ పస్తులు ఉండి తమ తల్లితోపాటు వెళ్ళిపోయింది. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి 45 మంది విద్యార్థినుల భవిష్యత్తును కాపాడాలని పలువురు కోరుతున్నారు. వసతి గృహాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటికి అనుమతులు, సౌకర్యాలు పరిశీలించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, సీఈవో, సభ్యులు

జిల్లా పరిషత్‌లో స్వచ్ఛతా హీ సేవ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 19:జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొని జిల్లా పరిషత్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోజువారీ నిర్దేశించుకున్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. మన ఇంటిని, మన గ్రామాల్లో పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. జడ్పీ సీఈవో సుబ్బారావు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాలొన్నారు.

క్రైమ్ కార్నర్

బీచ్‌లో గల్లంతైన యువకుని మృతి

మొగల్తూరు,సెప్టెంబరు 19: పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. భీమవరం పట్టణం మెంటేవారితోటకు చెందిన గంధం ప్రవీణ్ కుమార్ తన స్నేహితులతో కలిసి బుధవారం మధ్యాహ్నం బీచ్‌కు వెళ్లారు. తీరంలో సరదాగా గడిపిన అనంతరం స్నానానికి దిగారు. అలలు ఉధృతంగా రావడంతో ప్రవీణ్ కుమార్ (17) గల్లంతయ్యాడు. గల్లంతైన యువకుని మృతదేహం గురువారం ఉదయం మోళ్ళపర్రు బీచ్ ప్రాంతంలో తీరానికి కొట్టుకువచ్చింది. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 19 : కడుపునొప్పి భరించలేక ఒక యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు శనివారపుపేటలోని రామాలయం వీధినకు చెందిన సుంకర మణికంఠ (30) కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఈనెల 15వ తేదీన పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి గురువారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు.

షెడ్డు పైనుంచి పడి చికిత్స పొందుతూ మృతి

లింగపాలెం, సెప్టెంబరు 19: ఇంటిపై రేకులు వేస్తూ జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ధర్మాజీగూడెంలో చోటుచేసుకుంది. ముసునూరు మండలం లోపూడి గ్రామానికి చెందిన సత్తిబాబు (44) ఈనెల 13న ధర్మాజీగూడెంలోని ఓ ఇంటిపై రేకులు వేస్తుండగా రేకులు పగిలి కిందపడిపోయాడు. ధర్మాజిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళి ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19 పట్టాలు దాటుతున్న ఒక వృద్ధురాలిని వేగంగా వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పట్టాలు దాటుతున్న వృద్ధురాలిని రైలు ఢీకొంది. ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్‌కు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించారు. మృతురాలు పెదపాడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన పసుపురెడ్డి సుజాత (75)గా గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి గురువారం తరలించారు.

అప్పుల బాధతో ఉల్లిపాయల వ్యాపారి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 19: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడేపల్లిగూడెంలో చోటు చేసుకుంది. అత్తిలికి చెందిన తమ్మాబత్తుల రాము (52) ఉల్లిపాయల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టం రావడం, అప్పుల వాళ్ల ఒత్తిడి చేస్తుండటంతో గురువారం ఉదయం పట్టణంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకుని తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గది నుంచి రాము బయటకు రాకపోవడంతో సిబ్బంది గది తలుపులు తెరిచి చూసే సరికి ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.




బోల్తాపడిన లారీ.. మృతి చెందిన డ్రైవర్.. గాయాలపాలైన క్లీనర్

అల్లం లోడు లారీ బోల్తా..డ్రైవర్ మృతి

దెందులూరు, సెప్టెంబరు 19 : రోడ్డు డివైడర్‌ను ఢీకొని అల్లం లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు గాయాలయ్యాయి. అల్లం లోడు వేసుకుని వెస్ట్ బెంగాల్ వెళుతుండగా జంగారెడ్డిగూడెం- తంగెళ్లమూడి ప్రధాన రహదారిలోని సోమవరప్పాడు పెట్రోలు బంకు దాటిన తరువాత వేగవరం సమీపంలో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టింది. లారీ నడుపుతున్న కోలకతాకు చెందిన లారీ డ్రైవర్ షేక్ నవబ్ బాషా (43) మృతి చెందాడు. క్లీనర్‌కు గాయాలవడంతో జాతీయ రహదారి పోలీసులు అంబులెన్స్ (108)లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు లారీని పక్కకు తీయించారు. దొరికిందే సందుగా తిరగపడిన లారీ నుంచి చాలామంది అల్లం పట్టుకుపోయారు..

భీమవరం రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ దాడులు



భీమవరం క్రైం, సెప్టెంబరు 19: ఏలూరు రీజనల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీరాంబాబు ఆదేశాలతో భీమవరం పట్టణంలో విజిలెన్స్, రెవెన్యూ పౌర సరఫరా అధికారులు రేషన్ దుకాణాలపై దాడులు చేశారు. దాడుల్లో పీడీఎస్ బియ్యం, పంచదార, సరుకుల్లో వ్యత్యాసాలను గుర్తించినట్లు తెలిపారు. ఎం.వి. సుబ్బయ్య షాప్ నెం.0584031, పీడీఎస్ బియ్యం 600 కేజీలు, 23 కేజీలు పంచదార, 70 కేజీల పిండి ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. షాప్ నంబర్ 0584022లో బియ్యం 559 కేజీలు, పంచదార 5 ప్యాకెట్లు తక్కువ, షాప్ నంబర్ 05804002లో పంచదార 400 ప్యాకెట్లు ఎక్కువ ఉన్నట్లుగా నిర్ధారించారు. ఈ మూడు రేషన్ దుకాణాలపై 6 (ఏ) కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి, విజిలెన్స్ ఏవో సురేష్, విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్‌కుమార్, సీఎస్ ఆర్‌ఐ సురేష్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

నా పోలికలతో కొడుకు కావాలి..!

కోడలిని వేధించిన భద్రాద్రి రామాలయ ప్రధాన అర్చకుడు

తాడేపల్లిగూడెం పోలీసు స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

తండ్రీ కొడుకులపై లైంగిక వేధింపుల కేసు

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 19 : తన మామ తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ.. భద్రాద్రి రామాలయ ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులుపై ఆయన కోడలు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఆగస్టు 14న నమోదైన ఈ కేసు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. 2019లో ఆమెకు సీతారామానుజాచార్యులు కుమారుడు వెంకట సీతారామ్‌తో వివాహం జరిగింది. అనంతరం పలు సందర్భాల్లో మామ తనను లైంగికంగా వేధించారని.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన కోడలు ఆరోపించారు. మామగారిని నిలదీస్తే.. "నా కుమారుడు దత్తపుత్రుడు. నాకు నా పోలికలతో ఒక బాబు కావాలి" అని చెప్పారని.. ఆయన గురించి పలుమార్లు అత్తకు, భర్తకు చెప్పినా పట్టించుకోకపోగా తననే తిట్టి, గదిలో బంధించి చిత్రహింసలు పెట్టారని పేర్కొన్నారు. పెళ్లయిన ఆర్నెళ్ల తర్వాత నుంచి.. రూ.10 లక్షల కట్నం తేవాలంటూ అత్త, ముగ్గురు ఆడపడుచులు, రెండో ఆడపడుచు భర్త, మూడో ఆడపడుచు భర్త తనను వేధిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు వీరందరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం దేవస్థానం అధికారులకు తెలియకుండా గోప్యంగా ఉంచారనే ఆరోపణలతో దేవస్థానం ప్రధాన అర్చకుడు సీతారామానుజాచార్యులుపై సస్పెన్షన్ వేటు పడింది. ఇదే ఘటనలో దేవస్థానంలో అర్చకుడిగా పని చేస్తున్న ఆయన కుమారుడు సీతారామంపై సైతం కేసు నమోదు కావటంతో అతడిని కూడా సస్పెండ్ చేస్తూ భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తమ్ముడి భార్యపై కన్నేసిన అన్న

ద్రౌపదికి ఐదుగురు లేరా..? సర్దుకుపోవాలంటూ చిన్న కోడలికి అత్త హితవు

లొంగకపోయే సరికి తమ్ముడు, మరదలిపై దాడి

నూజివీడు/నూజివీడు టౌన్, సెప్టెంబరు 19 : తను ఏం చేసినా వెనకేసుకుని వచ్చే తల్లి.. తమ్ముడి నిస్సహాయత, మరదలి అమాయకత్వం.. వెరసి అతనిలో కీచకుడు వెలుగు చూశాడు. ఏదో రకంగా తన మరదలిని లొంగదీసుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేశాడు. లొంగకపోయే సరికి వారిద్దరిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వారిద్దరిని చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలివి.. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన కలిదిండి సత్యనారాయణ ప్రసాద్ కుమార్తె దివ్యకు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం పెదవెలమిల్లికి చెందిన దేవిన వెంకటేశ్‌కు తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. వెంకటేశ్ అన్న వీరభద్రం దివ్యపై కన్నేసి లైంగిక వేధింపులకు దిగుతున్నాడు. దీనిని గుర్తించిన వెంకటేశ్ తన సోదరుడి వ్యవహార శైలిపై అభ్యంతరం చెబుతూ తల్లి దేవిన మణికుమారికి విషయం వివరించాడు. దీనికి ఆమె 'భార్య లేని వాడు కదా.. ఏం చేస్తాడు. పాండవులు ద్రౌపదిని చేసుకోలేదా ? మీరిద్దరే కదా ఇంటి విషయాల్లో సర్దుకుపోవాలి' అంటూ పెద్ద కుమారుడు వీరభద్రాన్ని వెనకేసుకుని రావడంతో అతను నిర్ఘాంతపోయాడు. వెంకటేశ్ తమ పరిస్థితిని అత్త మామలైన కలిదిండి సత్యనారాయణ, జ్యోతిలకు వివరించారు. అయినప్పటికీ పరిస్థితులు చక్కబడకపోగా వేధింపులు మరింత పెరిగాయి. వీరభద్రం పలుమార్లు దివ్యపై విచక్షణా రహిత దాడికి దిగేవాడు. ఈ క్రమంలో శుక్రవారం తమ్ముడు, మరదలిపై అతను మరో సారి దాడి చేయడంతో వారు ఇంటి నుంచి బయటపడి నిడదవోలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలిసిన మామ సత్యనారాయణ కూతురు, అల్లుడిని నూజివీడు తీసుకువచ్చి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఒంటిపై పలుచోట్ల తీవ్రగాయాలు ఉండటంతో చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దాడికి దిగి రోజులు గడుస్తున్నా నిందితులపై చర్యలు మాత్రం కానరాకపోవడంతో తమ కూతురు, అల్లుడికి న్యాయం చేయాల్సిందిగా సత్యనారాయణ కోరుతున్నాడు.

శానిటరీ వర్కర్ల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

▸ కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరంటౌన్, సెప్టెంబరు 19 : శానిటరీ వర్కర్ల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో మున్సిపల్ శానిటరీ పనివాళ్ల ఆరోగ్య భద్రతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మునిసిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ శానిటరీ వర్కర్ల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక మెడికల్ క్యాంపులను నిర్వహించి పరీక్షలు చేయించాలన్నారు. శానిటరీ వర్కర్స్ వినియోగించే గ్లౌజులు, సబ్బులు, నూనెలు అందజేయాలన్నారు. డీఆర్‌వో జె.ఉదయభాస్కరరావు, వర్చువల్ కార్యక్రమంలో అన్ని మున్సిపల్ శాఖ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పురపాలకంలో భారీ బదిలీలు

నరసాపురం, సెప్టెంబరు 19: మునిసిపాల్టీలో భారీ బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎకౌంట్స్ విభాగంలో జేఈవోతో పాటు అసిస్టెంట్ ఎకౌంట్స్ అధికారులు, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే ఇద్దరి ఏఈలకు ఐదేళ్ల కాలం పూర్తయింది. వీరితో పాటు డీఈ విజయవాడ కార్పొరేషన్‌కు బదిలీ పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు రెండు రోజుల్లో వెలువడనున్నాయి.

గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములవ్వాలి



అయిభీమవరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రఘురామ

ఆకివీడురూరల్ సెప్టెంబరు 19 : గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాముల వ్వాలని ఎమ్మెల్యే రఘు రామ కృష్ణరాజు అన్నారు. అయిభీమవరంలో రూ. 15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లా డారు. వెంకయ్య వయ్యేరు కాల్వ గట్టుపై ఆనుకుని ఉన్న 96 మంది నివాసితులతో అర్హులైనవారికి ఇళ్లస్థలాలు మంజూరు చేశామన్నారు. సర్పంచ్ సామ్రాజ్యం, కూటమి నాయకులు మోటుపల్లి రామవరప్ర సాదు, కనుమూరు రామకృష్ణరాజు, నౌకట్ల రామారావు, జుత్తిగ నాగరాజు, కనుమూరు పెద్దిరాజు, గొంట్లా గణపతి, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, గ్రామ పెద్దలు కనుమూరు అబ్బాయిరాజు, అధికారులు పాల్గొన్నారు.

పార్మాసిస్టుల కొరత ఉంది

మందుల కోసం క్యూలో శీర్షికకు స్పందన

తణుకు, సెప్టెంబరు 19 : పార్మా సిస్టులు కొరత వల్ల మందులు పంపిణీలో జాప్యం జరుగుతుందని జిల్లా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ వి.అరుణ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మందుల కోసం క్యూ'లో అనే కథనానికి స్పందించిన ఆమె వివరణ ఇచ్చారు. ఆస్పత్రికి రోజు దాదాపు 500 మంది ఓపీ ఉంటుందని, అన్ని విభాగాలకి ఒకే డిస్పెన్సరీ ఉందన్నారు. జిల్లా ఆస్పత్రిలో ముగ్గురు పార్మాసిస్టులకు ఇద్దరే ఉన్నారన్నారు. జూలై 4న ఒక పార్మాసిస్టు రాజీనామా చేశారని, మరోకరు ప్రమోషన్‌లో వెళ్లారన్నారు. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే పనిచే స్తున్నారని, అందువల్లే జాప్యం జరుగుతుందన్నారు. అలాగే మందులు ఎపుడు వేసుకోవాలో మార్కర్ పెన్నుతో రాస్తున్నామన్నారు. ఇదే విషయాలను జిల్లా ఆస్పత్రులు సమన్వయాధికారి, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు తెలియజేశామని వివరించారు.

కొమ్ముగూడెం సొసైటీ నికర లాభం రూ.1.14 కోట్లు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 19: తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం విశాల సహకార పరపతి నికరలాభం రూ.1.14 కోట్లు వచ్చినట్టు పర్సన్ ఇన్‌చార్జి ఇ.లక్ష్మీకాంతం తెలిపారు. సంఘ ఆవరణలో గురువారం సంఘ మహా జనసభ నిర్వహించారు. సీఈవో సీహెచ్‌ఎస్‌వీ కృష్ణశర్మ మాట్లాడుతూ లాభాల్లో 9 శాతం షేర్ ధనమని తెలిపారు. సభ్యుల అవసరాల మేరకు అప్పులు త్వరితగతిన ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

కనకదుర్గమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

పెంటపాడు, సెప్టెంబరు 19 : ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్ద కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి హుండీని గురువారం ఆలయ ఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో డివిజన్ ఇండోమెంట్ ఇనస్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. మూడు నెలలకు రూ. మూడు లక్షల 45 వేల 675లు వచ్చినట్లు ఈవో తెలిపారు. కృష్ణయ్య పాలెం భక్తజన సమాజం మండలి మహిళలు లెక్కింపుకు సహకరించగా కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణనాథుడి ఊరేగింపులో కొట్లాట.. కేసు నమోదు

పాలకోడేరు, సెప్టెంబరు 19: పెన్నాడలో గణేశ్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని కొట్లాటపై కేసు నమోదు చేశామని పాలకోడేరు ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. గ్రామంలో ఈనెల 18న గణేశ్ నిమజ్జన ఊరేగింపు సమయంలో విగ్రహాన్ని తీసుకెళ్తున్న వాహనంపై ఉన్న డెకరేషన్‌ను గ్రామానికి చెందిన షేక్ షారూక్‌ఖాన్ డెకరేషన్ తొలగిస్తుండగా అదే గ్రామానికి చెందిన తాడి శ్రీనివాసరావు నిలదీశాడు. దీంతో షారూక్‌ఖాన్ శ్రీనివాస్ తలపై కొట్టడంతో రక్తస్రావమైంది. స్థానికులు శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స అందించారు. అతడి ఫిర్యాదు మేరకు షారూక్‌ఖాన్‌పై కేసు నమోదు చేశామన్నారు.

డ్వాక్రా యానిమేటర్ ఆత్మహత్యాయత్నం

భీమవరం క్రైం, సెప్టెంబరు 19 : చినఅమిరంలో ఒక డ్వాక్రా యానిమేటర్ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. ఆమెను స్థానికులు కాపాడడంతో ప్రస్తుతం కోలుకుంటుంది. బాధితురాలు, బంధువులు తెలిపిన వివరాలివి.. ఆ గ్రామానికి చెందిన తోట వరలక్ష్మీ అనే మహిళ సుమారు పదేళ్లుగా డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తుంది. గత ఎన్నికలలో ఓ పార్టీకి కొమ్ము కాసి పని చేశారని ప్రస్తుత అధికార పార్టీ నేతలు ఆమెను కక్షకట్టి ఉద్యోగం నుంచి తొలగించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో పేరు ఉన్నప్పటికీ తనతో పాటు మరో ముగ్గురిని కూడా తొలగించారని కుటుంబాలు రోడ్డున పడ్డాయి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆత్మహత్యే శరణ్యం అంటూ తెలిపారు. దీనిపై భీమవరంటూటౌన్ పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల ప్రాంతాలు

తాడేపల్లిగూడెం రూరల్/ఇరగవరం/ఆకివీడు/భీమవరం రూరల్/కాళ్ల, సెప్టెంబరు 19: పలు మండలాల్లో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి, మెట్టఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమ్మతపురం, మోదుగగుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, ఎల్. అగ్రహారం, కొండ్రుప్రోలు, కేఎస్‌ఎన్ కాలనీ, పెదతాడేపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో, ఇరగవరం మండలంలో రేలంగి, ఇరగవరం, పేకేరు, ఏలేటిపాడు, అయితంపూడి, రాపాక, కాకిలేరు గ్రామాల్లో, ఆకివీడు పట్టణంలోని సమతానగర్, ఇండస్ట్రియల్ ఫీడర్, గుమ్ములూరు రోడ్, కుప్పనపూడిలలో కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భీమవరం రూరల్ గ్రామాలైన గొల్లవానితిప్ప, ఎన్‌వీఎన్‌పురం, సీఏడీ కంపెనీ, పల్లిపాలెం, ఈలంపూడి ఏరియాలకు, కాళ్ల మండలంలోని కాళ్ళ, దొడ్డనపూడి, కాళ్ళకూరు, కోలనపల్లి, జువ్వలపాలెం, ఏలూరుపాడు, ప్రాతాళ్ళమెరక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **గణపవరం, సెప్టెంబరు 19:** గణపవరం బొబ్బిలి వంతెన ప్రమాదభరితంగా ఉందని తక్షణం పునరుద్ధరించాలని చిన్నం చిననాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం అన్నారు.
- **పాలకొల్లు టౌన్ :** ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు మూడో రోజు పురస్కరించుకుని పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ ఆధ్వర్యంలో 74 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** మేకల పెంపకంపై శిక్షణ పొందితే మంచి లాభాలు సాధించవచ్చని వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలోని కేవీకేలో మేకల పెంపకం కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు గోవిందరాజులు తెలిపారు.
- **భీమవరంటౌన్ :** పట్టణంలోని 30వ వార్డులో మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తనిఖీ చేసి సూచనలు జారీ చేశారు. వార్డు పరిధిలో శానిటేషన్‌కు సంబంధించి ఏవిధమైన చెత్తను వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.
- **ఉండి :** మహాదేవపట్నం సుగుణ ఫౌండేషన్ ప్రాంతంలో పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,600 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నీరుల్లా తెలిపారు.



కలెక్టర్‌కు విద్యాశాఖ తరపున రూ.8.53 లక్షల డీడీని అందించిన డీఈవో నాగమణి, తదితరులు



కలెక్టర్‌కు సహకార సంఘాల తరపున రూ.6.05 లక్షల డీడీని అందించిన అధికారులు



కలెక్టర్‌కు పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయం తరపున రూ.59,300 డీడీని అందించిన దృశ్యం



ఎంపీడీవో నరసింహప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న కొడమంచిలి జనసేన నాయకులు

వరద బాధితులకు ఆసరాగా..

భీమవరంటౌన్, సెప్టెంబరు 19: జిల్లా వ్యాప్తంగా విజయవాడ వరద బాధితులకు గురువారం పలువురు విరాళాలు అందజేశారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయు లు, మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు ద్వారా సేకరించిన రూ8,53,768 డీడీని జిల్లా కలెక్టర్ నాగరాణికి జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి చేతుల మీదుగా అందజేశారు.

- కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ నాగరాణికి జిల్లా, డివిజన్ సహకార శాఖ అధికారులు, సహాయ రిజిస్ట్రార్లు కలిసి 6లక్షల 05 వేల 063 రూపాయల డీడీని అందజేశారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, డీఎల్ పీవో కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు రాందాసు, హనుమంతరావు, సిబ్బంది ఉన్నారు.
- వరద బాధితులకు సహాయార్థం పట్టణంలోని 12వ వార్డు అక్షర ఎస్ఎల్ఎఫ్ డ్వాక్రా సీఆర్పీలు రూ.20వేలు సాయాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. సీఆర్పీ ఎ.దుర్గవతి, ఎస్.ఆదిలక్ష్మి, పి.పద్మ, టి.విమల, కె.గాయత్రి, సంఘ సభ్యులు, వార్డు సభ్యులు కొప్పునీడి శ్రీనివాస్‌రెడ్డి, సత్తిబాబు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం అర్బన్ : దర్శిపర్రు గ్రామానికి చెందిన సర్పంచ్ కోలా శేషవేణి, ఉప సర్పంచ్ కోలా మార్కండేయులు రూ.50 వేలు, కోడే కాళి రూ.50 వేల విరాళాలను జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. పాలూరి వెంకటేశ్వరరావు, వుల్లా బాబి, అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రూ.20 వేలు, కుంచనపల్లి నుంచి రూ.50 వేలు టీడీపీ కార్యాలయంలో అందజేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు అందజేసిన దాతలు

- ఆచంట : ఆచంట మండలం కొడమంచిలి జనసేన ఆధ్వర్యంలో సేకరించిన రూ. 22,500 విరాళాన్ని ఎంపీడీవో పి. నరసింహప్రసాద్‌కు జనసైనికులు అందజేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాది బాలాజీ, కట్టా రాంబాబు, కొలిశెట్టి హరినాథ్, ఇంజేటి కిషోర్, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి ఏసు, ఏనుగుల కృష్ణ, తీర్ధాల రాజేష్, కొల్లేపర సుబ్బారావు పాల్గొన్నారు.
- భీమలాపురం హైస్కూలు విద్యార్థులు, హైస్కూలు ఉపాధ్యాయులతో పాటు గ్రామానికి చెందిన చల్లావారి కుటుంబీకులు, గ్రామస్థులు సేకరించిన రూ. 56 వేల విరాళం చెక్కును ఇన్‌చార్జి తహసీల్దార్ సుగుణ సంధ్యకు అందజేశారు. సర్పంచ్ గుబ్బల మాధవరావు, ద్వాదశి సీతారామయ్య, చల్లా రాంబాబు, చల్లా శివలాల్, ఎంఈవో, హైస్కూలు హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు సేకరించిన రూ.59.300 డీడీని కలెక్టర్ చదలవాడ నాగరాణికి గురువారం అందించారు. ఈసందర్భంగా ఎంపిడివో సంగాని వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నుంచి విరాళాలు సేకరించామన్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి డాక్టర్ కేసీహెచ్ అప్పారావు ఉన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 19: విజయవాడలోని సింగ్‌నగర్ వరద బాధితులకు నరసాపురం రోటరీ క్లబ్ చేయూత నిచ్చింది. సుమారు వెయ్యి మందికి దుప్పట్లు, నైటీలు, పిల్లలకు బట్టలు, మహిళలకు చీరలు గురువారం క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. సుమారు రూ.5 లక్షలు విలువ చేసే వస్త్రాలను అందించారు. క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, సూర్యకుమారి, రమ, మురళీధర్, భవాని విజయ్, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

యలమంచిలి, సెప్టెంబరు 19: మండలంలోని కనకాయలంక, పెదలంక గ్రామాల్లో వరదబాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయంగా బియ్యం, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కనకాయలంక గ్రామంలో 908, పెదలంకలో 367 వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను ఎన్డీఏ నాయకులు అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, పామాయిల్, కేజీ కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలను పంపిణీ చేశారు. లక్ష్మీపాలెంలో పాడిరైతులకు పశువుల దాణాను ఎన్డీఏ నాయకులు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, పెదలంక సర్పంచ్ తాళ్ల నాగరాజు, చెరుకూరి అంజిబాబు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, రుద్రరాజు సత్యనారాయణరాజు, పీతల శ్రీను, చిట్టూరి ఆంజనేయులు, శ్యాంబాబు, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.



ఆచంటలో ఇన్‌చార్జి తహసీల్దార్‌కు విరాళం చెక్కు అందజేస్తున్న భీమలాపురం గ్రామస్థులు



తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు విరాళాలు అందజేస్తున్న నాయకులు



విజయవాడలో వరద బాధితులకు దుప్పట్లు అందిస్తున్న నరసాపురం రోటరీ క్లబ్ సభ్యులు



కనకాయలంకలో వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న ఎన్డీఏ నాయకులు

స్వచ్ఛత మనందరి బాధ్యత

▸ టౌన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

భీమవరం క్రైం, సెప్టెంబరు 19 : ప్రతీ ప్రభుత్వ సంస్థలను మన సొంత ఆస్తిగా భావిస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్వచ్ఛత మనందరి బాధ్యత అని టౌన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్ సూచించారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో టౌన్ రైల్వేస్టేషన్ ఆవరణలో స్వచ్ఛత హీ సేవా కా ర్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు చెరుకవాడ రంగసాయి, రైల్వే కమర్షియల్ గూడ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ దస్తగిరి, ఏఎస్‌ఐలు పారిశుధ్య కార్మికులు చీపురులు పట్టుకుని ప్లాట్‌ఫాంలను శుభ్రం చేశారు.

- నరసాపురం టౌన్/మొగల్తూరు : వైఎన్ కళాశాల, పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పురపాలక సంఘంలో కమిషనర్ అంజియ్య సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఐ నానాజీ, డీఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలం మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల గ్రామీణ విస్తరణాధికారి నవీన్ కిరణ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ప్రతిజ్ఞ చేశారు. మొగల్తూరు సర్పంచ్ పడవల మేరీ తదితరులు పాల్గొన్నారు.
- భీమవరం ఎడ్యుకేషన్ : చెత్త నుంచి ఎనర్జీ అభివృద్ధి చేసే విధానాన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున ఒక మహాయజ్ఞంలా వస్తే కాలుష్య నివారణ జరుగుతుందని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతిరాజు అన్నారు. గురువారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్‌పీఎస్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జగన్నాథపురం జడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, నాయకులు

- తణుకు/ఇరగవరం/అత్తిలి : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దువ్వ సర్పంచ్ అడ్డా వెంకట సూర్యనారాయణమూర్తి అన్నారు. తణుకు ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేశారు. కూటమి నాయకులు చిక్కాల వేణు, శ్రీరాములు చిన్ని, అరిగెల బాబి, దాసరి బాబి, కట్టా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు. ఇరగవరం మండలంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అత్తిలి మండలం అత్తిలి మండల ప్రజా పరిషత్ కారాలయ్యాన్ని శుభ్రపరిచారు. ఇన్‌చార్జి ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : గ్రామం శుభ్రతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో విశ్వనాథ్ పేర్కొన్నారు. జగన్నాథపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీటీసీ నాగు, ఉపసర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆకివీడులో అన్న క్యాంటీన్‌కు వంద రోజులు



దాత సత్యనారాయణరాజును సన్మానిస్తున్న నాయకులు

ఆకివీడు, సెప్టెంబరు 19 : ఆకివీడులో అన్నక్యాంటీన్ ద్వారా ప్రతిరోజు 400 మంది పేదల కడుపు నింపుతున్న అన్నదాత, టీడీపీ క్రియాశీలక సభ్యులు గొట్టుముక్కల వెంకటసత్యనారాయణరాజు అభినందనీయుడని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. ఆకివీడులో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేసి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అన్నదాత సత్యనారాయణరాజు మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే వరకు అన్న క్యాంటీన్ కొనసాగిస్తానన్నారు. మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, మండల-పట్టణ కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, జాకీర్, అజ్మల్, శింగవరపు కోటేశ్వరరావు, చౌదరి, నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్, మేనేజరు కోటేశ్వరరావు, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కొవ్వలి ట్రస్టు సేవలు అభినందనీయం



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం టౌన్, సెప్టెంబరు 19: నియోజకవర్గంలో ప్రతినెల పేదలకు మందులు, నిత్యావసర వస్తువులు, పింఛన్లు అందిస్తూ పేదలకు బాసటగా నిలుస్తున్న కొవ్వలి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. గురువారం ట్రస్టు ఆధ్వర్యంలో మందుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ట్రస్టు చైర్మన్ కొవ్వలి నాయుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో సేవల్ని మరింత విస్తృతం చేస్తామన్నారు. సంకు భాస్కర్, మల్లాడి మూర్తి, బాబు, మురళీ పాల్గొన్నారు.

న్యాయవాదిని ఉచితంగా ఏర్పాటు చేస్తాం

తణుకు / నరసాపురం టౌన్, సెప్టెంబరు19 : ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకపోతే ఉచిత న్యాయవాదిని కోర్టు ద్వారా ఏర్పాటు చేస్తామని జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి కె.రత్నప్ర సాద్ అన్నారు. గురువారం తణుకు సబ్ జైలు, నరసాపు రం పట్టణంలోని సబ్ జైలును పలువురు న్యాయాధికారులతో కలిసి ఆయన సందర్శించారు. జైళ్లలో వైద్య సదుపాయాలు, ఆహార, వసతిని అడిగి తెలుసుకున్నారు. తణుకులో జైలు సూపరింటెండెంట్ జి. మోహనరావు, జైలు విజిటింగ్ న్యాయవాది సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా వేదిక కార్యక్రమాలు

ఆచంట, సెప్టెంబరు 19 :నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో పరిష్కరించేందుకు శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాలు జరుగుతాయని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఈనెల 20న మధ్యాహ్నం పెనుగొండ పంచాయతీ పార్కు వద్ద, 21న సిద్ధాం తం, 22న ఆ చంట మండలం కోడేరు, 23న ఎ.వేమవరం, 24న పోడూరు మండలం, గుమ్ములూరు, 25న పెనుమంత్ర మండలం మాముడూరు, 26న మార్టేరు గ్రామాల్లో జరుగుతాయన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలు ప్రారంభం

అత్తిలి, సెప్టెంబరు19 : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు, ఎంపికను మండల టీడీపీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ గురువారం ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, షాట్‌పుట్ తదితర పోటీలను ప్రారంభించారు. టీడీపీ మండల కార్యదర్శి ఆల్తి సత్యనారాయణ, పట్టణశాఖ అధ్యక్షుడు పూతినీడి శ్రీనివాసరావు, బోడపాటి సూర్యచంద్రరావు, కొరిపల్లి ప్రసాద్, కూసంపూడి ప్రభు, తోట త్రిమూర్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళల అరెస్టు

నరసాపురం సెప్టెంబరు 19: ప్రయాణికురాలి పర్సును దొంగిలించిన ఇద్దరి మహిళల్ని అరెస్టు చేశామని పట్టణ ఎస్‌ఐ ముత్యాలరావు తెలిపారు. గురువారం సఖినేటిపల్లి నుంచి నరసాపురం మండలం ఎల్‌బీచర్లకు చెందిన తిరుమాని రంగారావు భార్యభర్తలిద్దరూ పంటుపై వస్తున్నారు. ప్రయాణంలో పరిచయమైన ఇద్దరు మహిళలు మాటల్లో పెట్టి రంగారావు భార్య బ్యాగ్‌లో ఉన్న పర్సు కొట్టేశారు. దిగే సమయంలో బ్యాగ్ చూసుకున్న ఆమె ఇద్దరి మహిళల్ని నిలదీయడంతో విషయం బయటపడింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆధ్యాత్మికం

భారీగా గణేష్ నిమజ్జనాలు

నరసాపురం టౌన్/ఆకివీడు/పెనుగొండ/తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం టౌన్, సెప్టెంబరు 19: వశిష్ఠ గోదావరిలో గురువారం భారీగా వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. నరసాపురం పట్టణ, మండలం, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన విగ్రహాలను ఊరేగింపుగా మాధవాయిపాలెం రేవు వద్దకు తీసుకొచ్చి నిమజ్జనాలు చేశారు. చిట్టవరం ప్రాంతానికి చెందిన వి నాయకుడ్ని ఎద్దుల బండిపై ఊరేగిస్తూ తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఆకివీడు భుజబలరాయుడు మంచినీటి చెరువు దగ్గర ఆగస్త్యే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని గురువారం వెంకయ్య వయ్యేరు కాల్వలో నిమజ్జనం చేశారు. పెనుగొండ మండలం సిద్ధాంతం మేడిశెట్టివీధి, గణేష్ యూత్ ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా పచ్చి పూలతో అలంకరించిన వాహనంపై స్వామివారిని ఉంచి పలు సంప్రదాయ వాయిద్యాలతో, బుట్ట బొమ్మలతో గ్రామోత్సవం నిర్వహించారు. తాడేపల్లిగూడెం రూరల్ శేషమహల్ సెంటర్‌లోని విఘ్నేశ్వర సైనిక్స్ 41వ చవితి మహోత్సవం సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. భీమవరం పట్టణంలోని రెస్ట్ హౌస్ రోడ్ లోని జాలర్ల రెండో వీధిలో 13వ వినాయక చవితి వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక మట్టిప్రతిమకు జలాభిషేకం చేసి నిమజ్జనం చేశారు. వందమందికి పైగా మహిళలు గంగాజలాన్ని కలశాలతో, సన్నాయి వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి మట్టి వినాయకుడికి అభిషేకంచేసి నిమజ్జనం చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పందిరి రాట

భీమవరంటౌన్ : పట్టణంలోని మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో అమ్మవారి శర్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం పందిర రాట ముహుర్తాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చేనెల 3 నుంచి 12వ తేదీ విజయదశమి వరకు అమ్మవారికి విశేష పూజలు, ప్రతిరోజు దాతల సహకారంతో ప్రత్యేక అలంకరణలు, కుంకుమ పూజలు, ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సమతం తాతాజీ, మురళీ, మద్దల సత్యనారాయణ, ఎం.సాయిబాబు, ఏడిద సుబ్బారావు, చవ్వాకుల శివ, కోయ త్రిమూర్తులు, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పట్టణ బ్రాహ్మణ సంఘం సాయం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 19 : ఇటీవల వరదల కారణంగా యలమంచిలి మండలం పెదలంక గ్రామంలో ముంపు బారినవల్ల ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు తమ వంతు సహాయంగా బుధవారం సాయంత్రం పాలకొల్లు శ్రీ గాయత్రీ స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం, బట్టలు అందించామని సంఘ నాయకులు గురువారం తెలిపారు. సంఘ నాయకులు తనికెళ్ళ శ్రీనివాస్, ముసునూరి ఫణి సాయిరాం, పెండ్యాల భవానీ, కలగ శంకరం, తదితరులు పెదలంక వెళ్ళి గ్రామ సర్పంచ్ తాళ్ళ నాగరాజు సమక్షంలో గ్రామస్తులకు సహాయం అందించామన్నారు.

21, 22 తేదీల్లో సైన్స్ ఫెయిర్

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 19 :స్థానిక శ్రీసరస్వతి శిశుమందిరం హైస్కూల్లో ఈనెల 21, 22 తేదీలలో సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశామని శిశుమందిరం కార్యవర్గ కమిటీ సభ్యులు వీవీ తిరుపతిరాజు, సత్యజిత్‌కుమార్ తెలిపారు. శ్రీ సరస్వతి విద్యాపీఠం (విజయవాడ) ఆధ్వర్యంలో 21న ఉదయం ప్రారంభ కార్యక్రమం ఉంటుందని 22వ తేదీ మధ్యాహ్నా మూడు గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సరస్వతి శిశుమందిరాలు 15 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

పునరావాసానికి సమతానగర్ బాధితులు

ఆకివీడు, సెప్టెంబరు 19 : వరద నీరు తగ్గకపోయినా పునరావాసులను తమ ఇళ్లకు అధికారులు పంపించడంతో స్థానిక సమతానగర్ శివారు చినకాపవరం సమీపంలో ఉన్న చెంచుల కాలనీలో కొంతమంది బాధితులు సీపీఎం నేతలకు తమగోడు తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు అధికారులతో మాట్లాడి మళ్లీ పాఠశాలలోని పునరావాసానికి గురువారం తరలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఉప్పుటేరు తక్కువగా లాగుతుండడంతో ఇంకా కొన్నిచోట్ల వరద నీరు తగ్గలేదన్నారు. వేగంగా లాగేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

పెంటపాడు, సెప్టెంబరు 19 : మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం అభినందనీయమని ఎయిర్‌వెటరన్స్ అసోసియేషన్ జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు తనుబుద్ది బోగేశ్వరరావు అన్నారు. ఇటీవల టీబీఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ నిట్‌లో నిర్వహించిన కార్గిల్ విజయ దివాస్ వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనితకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించడంతో సానుకూలంగా స్పందించారన్నారు. మాజీ సైనికుల 30 ఏళ్లగా చిరకాల కల నేటితో నెరవేరిందన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, హోం మంత్రి అనితకు, మాజీ డైరక్టర్ సైనిక్ వెల్ఫేర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మంచి ఆలోచనలు ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 : విద్యార్థి ప్రాథమిక దశ నుంచి మంచి ఆలోచనలతో ఉన్నతంగా తీర్చిదిద్దబడతాయని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. చినఅమిరం జడ్పీ ఉన్నత పాఠశాలలో కళాశాల సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో హ్యూమన్ వాల్యూస్ అండ్ ఎథిక్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం డాక్టర్ జి.శశికళ అధ్యక్షతన నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కేవీఎస్‌టీ లవకుమార్ మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం వి.అనురాధ, జి.శ్రీసత్య, చింతపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.